క్లుప్తంగా

ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



ఆలయ అభివృద్ధి పనులపై సూచనలు చేస్తున్న దేవదాయ శాఖ స్తపతి శ్రీనివాసాచార్యులు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని దేవదాయ శాఖ(కాకినాడ) స్తపతి శ్రీనివాసాచార్యులు సూచించారు. మంగళవారం ఆలయంలో జరుగుతున్న పనులను పరిశీలించిన ఆయన ఆలయాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రదక్షిణ, ప్రాకార మండపాలు, అర్చక గృహాలు, రక్షణ గోడ, కోనేరు నిర్మాణాలను చేపట్టాలన్నారు. తోటపల్లి ఆలయానికి పూర్వవైభవం తీసుకువచ్చేలా పనులు జరపాలని, నిర్మాణానికి దాతలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఈఓ బి.ఎల్. నగేష్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు డి.పారినాయుడు, ఎం.పకీరునాయుడు, డి.ధనుంజయరావు, ఎ.కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి భూముల రీసర్వే

వీరఘట్టం: వీరఘట్టం రెవెన్యూ పరిధిలో బుధవారం నుంచి భూముల రీసర్వే చేపట్టనున్నట్లు తహసీల్దార్ చందక సత్యనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక పట్టణంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశమైన ఆయన పక్కగా సర్వే చేపట్టాలన్నారు. మొత్తం 519 సర్వే నంబర్లలోని 2,070 ఎకరాల్లో సర్వే చేయాల్సి ఉంటుందన్నారు.

పక్కగా జగనన్న గోరుముద్ద పథకం అమలు



మధ్యాహ్న భోజనం వంటకాలు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకం పక్కగా అమలు చేయాలని డిప్యూటీ డీఈఓ పి.బ్రహ్మాజీరావు సూచించారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి చూసి, పరిశీలించారు. వంటకాలు రుచి, శుచి కలిగి ఉండాలని, వేడివేడిగా ఉన్నప్పుడే విద్యార్థులకు భోజనం వడ్డించాలన్నారు. మెనూ ప్రకారం రోజువారీ వంటలు ఉండాలన్నారు. వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి తెలిపారు. వర్క్‌బుక్‌ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ ఎస్.నాగభూషణరావు ఉన్నారు.

వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



ప్రశ్నలు అడిగి, విద్యార్థుల విద్యాప్రగతి అంచనా వేస్తున్న పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్

భామిని: చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ సూచించారు. మంగళవారం స్థానిక కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)ను సందర్శించిన ఆయన అక్కడి విద్యార్థుల విద్యాప్రగతిపై ఆరాతీశారు. అనంతరం ప్రతీ తరగతికి వెళ్లి, విద్యార్థులను వివిధ ప్రశ్నలు అడిగి, వారి విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. సిబ్బంది కూడా విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు కృషి చేయాలని కోరారు.

సోషల్ ఆడిట్ తప్పనిసరి

సీతంపేట: స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించాల్సిన సోషల్ ఆడిట్‌పై ప్రధానోపాధ్యాయులకు ఇస్తున్న ఒక్కరోజు శిక్షణ తరగతులను ఎంఈఓ ఎం.ఆనందరావు మంగళవారం పరిశీలించారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను దృష్టిలో ఉంచుకుని, పక్కాగా సోషల్ ఆడిట్ చేయాలని సూచించారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

సీతంపేట: స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ సబ్‌డివిజన్ కార్యాలయంలో తాగునీటి సమస్యలకు సంబంధించి, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. వేసవి నేపథ్యంలో ఎవ్వరూ తాగునీటి ఇక్కట్లు పడకూడదన్న ఉద్దేశ్యంతో దీనిని ఏర్పాటు చేశామని, ఎవరైనా తాగునీటి కోసం ఇబ్బంది పడితే వెంటనే ఫోన్ నంబర్ 8639963063ను సంప్రదించాలని కోరారు.



వీరఘట్టంలో మలేరియా నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది



పాలకొండ: అన్నవరం పీహెచ్‌సీలో నినాదాలు చేస్తున్న సిబ్బంది



సీతంపేట: మర్రిపాడులో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యం



భామిని: బాలేరులో దోమతెరల వాడకంపై అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు దీపికారాణి

మలేరియా మహమ్మారిని తరిమికొడదాం

పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఆస్పత్రి, పీహెచ్‌సీల వైద్యారోగ్య సిబ్బంది ర్యాలీలు చేపట్టి, చిన్న ప్రాణులు–పెద్ద ప్రమాదాలు, మన ఆరోగ్యం–మన చేతుల్లోనే, దోమతెరలు వాడండి మలేరియాను నివారించండి అని నినాదాలు చేశారు. అనంతరం ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించి, మలేరియా మహమ్మారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. వణుకుతో కూడిన జ్వరం, దగ్గు, కండరాల నొప్పి, ఛాతిలో నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే మలేరియాగా పరిగణించి, చికిత్స తీసుకోవాలని తెలిపారు.

–సాక్షి నెట్‌వర్క్



కురుపాం: ర్యాలీలో రామభద్రపురం పీహెచ్‌సీ సిబ్బంది



కురుపాం: మలేరియా నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న నీలకంఠాపురం పీహెచ్‌సీ సిబ్బంది



జియ్యమ్మవలస: మలేరియాను తరిమికొడదాం అని నినదిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది



కొమరాడలో జరిగిన కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది



గరుగుబిల్లి: రావివలసలో ర్యాలీలో పాల్గొన్న వైద్యారోగ్య సిబ్బంది

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



కొండచిలకాంలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొండచిలకాం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న బల్లేరుగూడ, కొండచిలకాం, కిరిగేషు, బల్లేరు గిరిజన గ్రామాల్లో ఎమ్మెల్యే మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమెకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజల బాగు కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, అన్ని వర్గాలకు అన్ని రంగాల్లో సమన్యాయం చేయడమే ఆయన లక్ష్యమన్నారు. ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతోనే సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చారని, దీంతో గ్రామాల్లోనే చాలావరకు ప్రజాసమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. అలాగే ఎన్నికల హామీలతో పాటు సభలు, సమావేశాలు, సదస్సుల్లో ఇచ్చిన మరెన్నో హామీలను చిత్తశుద్ధితో అమలు చేశారని పేర్కొన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, పార్టీలకు అతీతంగా ఆయన పథకాలు అందిస్తున్న తీరు దేశానికే ఆదర్శమన్నారు. ఇప్పటివరకు అమలైన పథకాల్లో ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, జగనన్నను మళ్లీ సీఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గణేష్, జెడ్పీటీసీ మూడడ్ల శశికళ, మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

కరుణించమ్మా.. బంగారు తల్లి..



బంగారు తల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ రూరల్: మండలంలోని పొట్లి గ్రామంలో జరుగుతున్న బంగారు తల్లి ఉత్సవాల్లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మంగళవారం పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండేలా దీవించమని వేడుకున్నారు. దాదాపు 58 ఏళ్ల తర్వాత జరిగే ఈ ఉత్సవాలకు భారీ సంఖ్యలో గ్రామస్తులు బంధువులు, మిత్రులతో కలిసి పాల్గొనడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ఉదయం మహిళలంతా కలిసి అమ్మవారికి ముర్రాటలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.కృష్ణారావు, వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనిల్‌కుమార్, ఎంపీటీసీ పొంద్రంకి హైమావతి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రణస్థలం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఇంటా 'సంక్షేమ' కాంతులు



తాలాడలో మహిళకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

సీతంపేట: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతిఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాలాడ గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న వెంకటిగూడ, మూర్తిగాడిగూడ, బెన్నడుగూడ, ఉయ్యాలగూడ, సింగన్నగూడ, ఎగువసేర, దిగువసేర, సింగన్నగూడ గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలని కోరారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఆయనదేనన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ప్రతీ గ్రామంలో 50 ఇళ్లకు చొప్పున ప్రభుత్వం నియమించిన వలంటీర్లే నేరుగా ఇంటికి వచ్చి, సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అలాగే గ్రామంలోని సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజాసమస్యల పరిష్కారం జరుగుతోందన్నారు. గతంలోని టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌పై ఒక్కరోజు శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈఓ నాగభూషణరావు

గరుగుబిల్లి: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించనున్న సోషల్ ఆడిట్(సామాజిక తనిఖీ)పై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణకు హాజరైన ప్రధానోపాధ్యాయులకు ఆడిట్ ఎలా చేయాలన్న విషయంపై ఎంఈఓ ఎస్.నాగభూషణరావు అవగాహన కల్పించారు. విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, మనబడి–నాడు నేడు కింద జరుగుతున్న అభివృద్ధి పనులు, జగనన్న గోరుముద్ద పథకం అమలుపై ఆడిట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆడిట్‌కు సంబంధించి మొత్తం 80 ప్రశ్నలు ఉంటాయని, ఈ నెల 29వ తేదీలోగా ప్రక్రియ పూర్తి చేసి, నివేదిక సమర్పించాల్సి ఉంటుందన్నారు.

వేతనదారుల సంఖ్య పెంచాలి



ఉపాధి హామీ పనులపై సమీక్షిస్తున్న జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథకం సంచాలకులు రామచంద్రరావు

గుమ్మలక్ష్మీపురం: ఉపాధి హామీ పథకం పనుల్లో వేతనదారుల సంఖ్య పెంచాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు కె.రామచంద్రరావు సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశమైన ఆయన మండలంలో జరుగుతున్న ఉపాధి పనులపై సమీక్షించారు. నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేయించాలని, వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, బోగస్ మస్తర్లు లేకుండా చూడాలని, జాబ్‌కార్డు ఉన్న వారినే పనులకు అనుమతించాలని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు, ఏపీఓ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



హోటళ్ల యజమానులతో సమావేశమైన తహసీల్దార్ సోమేశ్వరరావు

పాలకొండ రూరల్: స్థానిక పట్టణంలో వివిధ హోటళ్ల యజమానులు, ఫుడ్‌సెంటర్ల వ్యాపారులతో తహసీల్దార్ పి.సోమేశ్వరరావు మంగళవారం సమావేశమయ్యారు. వంటకాలు వండడంలోనూ, వాటిని భద్రపరచడంలోనూ, అమ్మకంలోనూ ప్రభుత్వ నిబంధనలు పాటించాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిశుభ్రమైన ఆహారాన్నే అమ్మాలని, కలుషితమైన ఆహారం అమ్మి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే ఊరుకునేది లేదన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ బుచ్చయ్య, సీఎస్‌డీటీ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పక్కాగా హద్దురాళ్ల ఏర్పాటు

భామిని: భూముల రీసర్వేలో భాగంగా మండలంలోని పక్కుడుబద్ర, వడ్డంగి, బొమ్మిక గ్రామాల్లో జరుగుతున్న హద్దురాళ్ల ఏర్పాటును పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ మంగళవారం పరిశీలించారు. పక్కాగా హద్దురాళ్ల ఏర్పాటు చేయాలని, రైతుల సమక్షంలో వీటిని ఏర్పాటు చేస్తే మరెప్పుడూ వారి మధ్య భూతగాదాలు రావన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ తోట రామ్మోహనరావు, ఆర్ఐ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అసిరితల్లి ఉత్సవాలు ప్రారంభం



ఆకట్టుకున్న మహిళల కోలాటం

పాలకొండ రూరల్: మండలంలోని కొండాపురం గ్రామంలో అసిరితల్లి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దాదాపు 64 ఏళ్ల తర్వాత ఈ పండగ జరగడంతో ఉద్యోగం, ఉపాధి రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన గ్రామస్తులంతా గ్రామం చేరుకున్నారు. దీంతో పండగ వాతావరణం నెలకొంది. ఉదయం మహిళలంతా అమ్మవారికి ముర్రాటలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం మహిళల కోలాటం ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

మెరుగైన విద్యనందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న గురుకులాల జిల్లా సమన్వయకర్త చంద్రావతి

గరుగుబిల్లి: గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని గురుకులాల జిల్లా సమన్వయకర్త బి.చంద్రావతి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని గురుకుల కళాశాలను సందర్శించిన ఆమె ఇటీవల జరిగిన పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు, వాటి ఫలితాల అంచనాపై సిబ్బందితో చర్చించారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టిసారించాలని తెలిపారు.

జోరుగా 'ఉపాధి' పనులు

జియ్యమ్మవలస: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు జోరుగా జరుగుతున్నాయి. తాళ్లడుమ్మ గ్రామ వెంకమ్మ కోనేరు దగ్గర జరుగుతున్న ఉపాధి పనులను ఉపాధి హామీ పథకం పీడీ రామచంద్రరావు మంగళవారం పరిశీలించారు. రెండు పూటలా నిర్దేశిత కొలతల్లో సక్రమంగా పనిచేస్తే రోజుకు రూ.272 వేతనం లభిస్తుందని వేతనదారులకు తెలిపారు. అలాగే పనిలోకి వచ్చిన వారికే మస్తర్లు వేయాలని, బోగస్ మస్తర్లు వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు.



జియ్యమ్మవలస: తాళ్లడుమ్మలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న పీడీ రామచంద్రరావు



పాలకొండ రూరల్: యరకారాయపురంలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: మండలంలోని గొట్టమంగళాపురం, యరకారాయపురం, గోపాలపురం గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ త్రినాథులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేతనదారుల మస్తర్లు, వారు చేస్తున్న పనులు పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపట్టాలని, అలా అయితే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు.

'జగనన్నే మా భవిష్యత్'కు అపూర్వ ఆదరణ

- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి అన్నిచోట్ల అపూర్వ ఆదరణ లభిస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మంగళవారం స్థానిక పట్టణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన వారు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్తున్న పార్టీ నాయకులకు ప్రజలు ఘనస్వాగతం పలుకుతున్నారన్నారు. అలాగే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, పథకాలు చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా లేనిపోని ఆరోపణలు చేసి, ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని అయితే ప్రజలు వారి మాటలను నమ్మడం లేదన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగిస్తున్న సీఎం జగనన్నను వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించి, మరోసారి ఆయనను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాలవలస గౌరీపార్వతి, కనపాక సూర్యప్రకాశరావు, కోట అజయ్‌కుమార్, రణస్థలం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.